కున్నాడు. అతనికి నిద్ర పట్టేసింది.

కాని — ఆ అమ్మాయి హృదయంలో సప్త సముద్రాలు భీకరంగా ఘోషిస్తున్నాయి. తన జీవితం బుగ్గి అయిపోయింది. కాని, ఈ దుర్మార్గుడు తన మీద ఒక ముద్రవేసి వెళ్ళిపోతున్నాడు. దర్జాగా మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు. ఆడదానికి పెళ్ళి అయినట్టు గుర్తుగా మెళ్ళో మంగళ సూత్రాలు, వళ్లపూసలు, కాళ్ళకు మట్టెలు. కాని, మగాడికి అలాంటి గుర్తులేవీ లేవే. ఈ లాభంతో మగాడు ఏ వయసులోనైనా సరే మళ్ళీ పెళ్ళికి సిద్ధం. అదే మగాడికి పెళ్ళి అయినప్పుడు ఏదైనా గుర్తు పెడితే ఎంత బాగుంటుంది? ఎంత చదువు కున్నా ఆడవాళ్ళ బ్రతుకులు ఇలా ఎందుకు అయి పోతున్నాయి?

పంచెకట్టుతో నిద్రపోతున్న అతన్ని మంచానికి పై కండువాతోను, దుప్పటితోను కట్టేసింది. మంచి నిద్రలో వున్నాడు. అందగాడు, తెల్లని ముఖం, గిరజాల జుట్టు - ఆ అందం చూసే మోసపోయింది.

ఆ అమ్మాయి అతను కాల్చే సిగరెట్ తీసుకుంది. నోట్లో పెట్టుకుని వెలిగించుకుంది. లోపలికి పొగ లాగేసరికి దగ్గు వచ్చింది. మేలుకున్నాడు. 'ఏమిటిది' అన్నాడు. నోట్లో గుడ్డ కుక్కింది.

బాగా లోపలకు పొగపీల్చింది. సిగరెట్ ఎర్రగా కాలింది. అతని నుదుటి మీద బొట్టులాగా, బుగ్గల మీద, ముక్కు మీద, ఛాతీ మీద, మోచేతులు మీద, ఇంకా ఎక్కడ బాగా కనుపిస్తుందో అక్కడ సిగరెట్‌తో వాతలు పెట్టింది.

"ఇవిగో మిస్టర్, నీకు నాతో పెళ్ళి అయినట్టుగా గుర్తులు పెట్టాను నీ వంటి నిండా. మళ్ళీ పెళ్ళి చేసుకునే ముందు ఈ వాతలు ఏమిటని అడుగుతారు. అప్పుడు ఇలాగ నన్ను పెళ్ళి చేసుకున్నట్టు "తొలి అనుభవంలా లేద'ని నన్ను వదిలేసినట్టు మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నానని చెప్పు. తెలిసిందా బాస్టర్డ్! నీకు తొలి అనుభవం అంటే తెలుసునా? ఎంత మంది అమ్మాయిలతో తొలి అనుభవం చవిచూశావ్? రాస్కెల్!" అంటూ పళ్ళు కొరుకుతూ సిగరెట్ అతని కళ్ళ దగ్గరకు తీసుకు వెళ్ళబోయి ఆగిపోయింది.

బయటకు వెళ్ళబోతూ అతని నోట్లో గుడ్డ తీసేసి తలుపు దగ్గరకు వేసి వెళ్ళిపోయిందా అమ్మాయి. ●

ఆ వారంలో, స్నేహితుడి పెళ్ళిలో, అతని అల్లుడి కాశీ యాత్ర తంతు జరిపినపుడు, స్నేహితుడి కొడుకు బావగారి గడ్డం కింద బెల్లమ్ముక్క పెట్టి బతిమాలే దృశ్యం చూసి లక్ష్మీపతి మళ్ళీ విచారించాడు. తన కిద్దరు కూతుళ్ళు అమల, విమల. అమల పెళ్ళయితే దాని మొగుడికి గడ్డం కింద బెల్లమ్ముక్క పెట్టడానికి రేపు తనకో కొడుకు లేడనీ చాలా విచారించాడతను.

అమలా, విమలా పెద్దవాళ్ళయ్యారు. అవాళ శాలిని తియ్యటి కబుర్ని భర్త చెవిలో పడేసింది. లక్ష్మీపతి విచారంగా, "ఏమో! నాకు నమ్మకం లేదు" అన్నాడు. ఈసారి అబ్బాయే కలిగాడు. లక్ష్మీపతి ఆనందంతో "గడ్డం కింద బెల్లమ్ముక్క వొచ్చేడు మనింట్లోకి" అన్నాడు.

అమల పెళ్ళిలో లక్ష్మీపతి కొడుకు విజయ్ పెద్దక్క మొగుడి గడ్డం కింద బెల్లమ్ముక్క పెట్టి బతిమాలే సీనుని చూసి, తండ్రి ఎంతో సంతోషం పొందాడు. పెళ్ళయింది.

"ఇప్పుడు నాకే విచారమూ లేదోయ్" అన్నాడు లక్ష్మీపతి భార్యతో.

విజయ్‌కి పదేళ్ళొచ్చాయి. సినిమాలు ఎక్కువగా చూస్తాడు. ఆ అబ్బాయి ఇంట్లో వెయ్యి రూపాయిలు తండ్రి పర్సులోంచి కొట్టేసి పారిపోయాడు.

విమల తండ్రితో అంది, "బావ గడ్డం కింద బెల్లమ్ముక్కా, నాన్న నోట్లో అల్లమ్ముక్కా!"

— శివల జగన్నాధరావ్

ఔను నిజం

"'మీరు జైలు వార్డెన్‌గా వుండే ముప్పయి సంవత్సరాలలో ఒక్క ఖైదీ కూడా తప్పించకోలేదటు కదా! ఏం చేసేవారేమిటి?"

"రోజూ వారితో మీ భార్యలు ఇంకా బ్రతికే వున్నారని చెప్పేవాడిని అంతే!"

—కె.వి. మధుసూదనరావు, కాకినాడ.

భ(భు)క్తి

అక్కని, బావగారిని పండుగకు తీసుకొని రమ్మని తండ్రి చెప్పడంతో అక్క అత్తగారింటికి వచ్చిన రత్నాకర్ రెండు రోజుల తర్వాత అందరం కలసి వెళ్ళామనడంతో వుండక తప్పలేదు. రెండు రోజులు గడిచాయి. ఆ రోజు సాయంత్రమే బయలుదేరబోతున్నారు.

"రత్నా! భోజనానికి రా" అన్నది రత్నాకర్ వాళ్ల అక్క లత.

"మీ అత్తగారి పూజ అయిందా" అన్నాడు రత్నాకర్.

"ఆ అయిపోయింది" అన్నది లత.

"ఎలాగైనా మీ అత్తగారికి చాలా భక్తి. ఉదయమే లేచి స్నానం చేసి విఘ్నేశ్వరుడికి ముందు బెల్లం ముక్క నైవేద్యం పెట్టి రెండు కొబ్బరి కాయలు కొట్టనిదే కాఫీ కూడా త్రాగదు" అన్నాడు రత్నాకర్. "అయితే నీవు కూడా అందరి వలె పొరపాటు పడ్డావన్నమాట" అన్నది లత.

"మరి మీ అత్తగారికి భక్తి లేదంటావా నేను ఒప్పుకోను" అన్నాడు రత్నాకర్.

"నీవే కాదు. ఎవరూ ఒప్పుకోరు. అయినా అది మీ తప్పు కాదులే. ఇంతకీ అసలు సంగతి ఏమిటంటే ఈమధ్య కూరగాయల ధరలు ఏవ రీతంగా పెరిగిపోవడంతో మా అత్తగారు వేసిన ప్లాను ఇది. మా ఇంట్లో చాలా కొబ్బరి చెట్లు వున్నాయి. కాబట్టి వారంలో కనీసం ఈ కొబ్బరి కాయలతోనే ఏదో ఒక వంట చేయాలి. ఎటూ కొబ్బరికాయలు వాడుతున్నాం కాబట్టి స్నానం చేసి అది దేవుడు ముందు కొడుతుంది. దాంతో అటు భక్తురాలనే పేరు, ఇటు భుక్తి. అందులో మన హిందువులకు ఎంతమంది దేవుళ్లు వున్నారో నీకూ తెలుసు. ప్రతిరోజు ఒక దేవుడి పేర కొట్టినా ఇంకా చాలామంది మిగులుతారు" అన్నది లత.

"అదా మీ ఇంట్లో ఒక రోజు కొబ్బరి కూర, ఒక రోజు కొబ్బరి చెట్నీ, మరొక రోజు పులుసులో కొబ్బరి, ఇంకొక రోజు" అంటున్న రత్నాకర్‌తో "అంతేకాదు మా మామగారికి ప్రతి రోజూ చారు కాని, పులుసు కాని తప్పనిసరిగా వుండాలి. అది తీయటిదిగా వుండాలి. విఘ్నేశ్వరుడి ముందు పెట్టిన బెల్లం ముక్క ఈ చారులో కాని, పులుసులో కాని వేస్తుంది" అన్నది లత.

"ఆహా ఏమి భ(భు)క్తి" అన్నాడు రత్నాకర్.

—టి.వి.జి.కృష్ణ